పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

A.C.O - 9003200801
S.R - 9551168092

ఆంధ్రజ్యోతి చిరునామా : జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017



కార్యక్రమంలో పాల్గొన్న అశేష భక్తజనం

కుంభాభిషేక వేడుకలు ప్రారంభిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

నేత్రపర్వంగా కందస్వామి ఆలయ కుంభాభిషేకం

ప్యారీస్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్‌లో ప్రసిద్ధి చెందిన ప్రాచీన కందస్వామి ఆలయ కుంభాభిషేకం అశేష భక్తజనం మధ్య నేత్రపర్వంగా జరిగింది. ఈ ఆలయంలో ఈ నెల 10వ తేదీ విఘ్నేశ్వరపూజ, గణపతి హోమంతో కుంభాభిషేక వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో శివాచార్యులు ఆరుజాముల పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 10 గంటలకు భక్తుల దివ్య నామస్మరణ, మేళతాళాలు, వేదమంత్రోచ్చారణ మధ్య శివాచార్యులు ఆలయ రాజగోపురం, అన్ని సన్నిధుల విమానాలపై పవిత్ర జలాలను సంప్రోక్షించి కుంభాభిషేకాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మూలవర్ కందస్వామికి, ఉత్సవమూర్తి ముత్తుకుమారస్వామికి మహాకుంభాభిషేకం నిర్వహించారు. హిందూ దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, నగర మేయర్ ప్రియ, ధర్మకర్తలు అశోక్‌కుమార్, నందకుమార్, సురేష్‌కుమార్, లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులందరికీ ఆలయం తరుపున తీర్థ అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.



మైలాడుదురై సభలో మహిళకు సహాయాలు అందిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

జనాన్ని చూసి ఈపీఎస్‌కు వణుకు

- విమర్శల పేరుతో ప్రభుత్వానికి ప్రచారం
- మైలాడుదురై సభలో సీఎం స్టాలిన్

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 'ఉంగలుడన్ స్టాలిన్' పేరుతో ప్రారంభమైన ప్రజావిజ్ఞప్తుల శిబిరాలకు వస్తున్న జనాలను చూసి ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామికి వణకుపుట్టి, విమర్శల పేరుతో డీఎంకే ద్రావిడ తరహా పాలనకు విస్తృత ప్రచారం చేస్తున్నారని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ యెద్దేవా చేశారు. మైలాడుదురై మనపందల్ ఏవీసీ కళాశాల మైదానంలో బుధవారం జరిగిన సభలో ఆ జిల్లాలో రూ.432.92 కోట్లతో పూర్తయిన 47 పథకాలను ప్రారంభించి, కొత్తగా చేపట్టనున్న 12 పథకాలకు శంకుస్థాపన చేసి, 54,461 మంది లబ్దిదారులకు సహాయాలను పంపిణీ చేశారు. ఆ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ ఉంగలుడన్ స్టాలిన్ పథకం గురించి తాను ప్రకటన చేయగానే ప్రతిపక్షనాయకుడు ఈపీఎస్‌కు మంటపుట్టిందని, విజ్ఞప్తులు అందజేయడానికి వచ్చే జనాన్ని చూసి, అధికారులు సమస్యలు పరిష్కరించేందుకు ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లటం చూసి ఈర్ష్య కలిగి పసలేని విమర్శలు చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు స్టాలిన్ ఊరూరా తిరిగి ప్రజలనుండి స్వీకరించిన విజ్ఞప్తులు ఏమయ్యాయంటూ ఆయన ప్రశ్నించారని, ఆ విజ్ఞప్తులన్నీ ఎక్సెల్‌షీట్లుగా, వర్క్‌షీట్లుగా మారి పరిష్కారమయ్యాయని వెల్లడించారు. కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం అమలు చేయలేరని ఆరోపించిన ఈపీఎస్ ప్రస్తుతం అన్నాడీఎంకేకు చెందిన గృహిణులు కూడా ప్రతి నెలా రూ.1000లు పొందుతున్న విషయాన్ని గమనించలేదా అని స్టాలిన్ ప్రశ్నించారు. వెలుగుబాట పయనం ద్వారా మహిళలు ఉచితంగా బస్సులో ప్రయాణించి ప్రతి నెల రూ.800ల వరకు పొదుపు చేయగలుగుతున్నారని, వారి ఆర్థికస్థితి మెరుగైందన్న విషయాలు ఈపీఎస్‌కు తెలియకపోవడం శోచనీయమన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఈపీఎస్‌కు గుడ్‌బై...

ప్రతిపక్షనేత ఈపీఎస్ 2019 నుండి వరుసగా పది సార్లు జరిగిన ఎన్నికల్లో వరుసగా ఓటమినే చవిచూశారని, ప్రజలు ప్రతి ఎన్నికల్లోనూ ఆయనకు టాటా చెబుతూ వచ్చారని, వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఆయనకు గుడ్‌బై చెప్పటం ఖాయమని స్టాలిన్ పేర్కొన్నారు. ఇటీవల ఈపీఎస్ ప్రతిపక్షనేత అనే విషయాన్ని కూడా మరచి మహిళలను కించపరిచేలా విమర్శించారని, వెయ్యి రూపాయల కోసం మోసపోవద్దంటూ మహిళలకు హితవు చెప్పి తన స్థాయిని దిగజార్చుకున్నారని, ప్రజలు, మహిళలు ద్రావిడ తరహా డీఎంకే పాలనలో మోసపోలేదని, ప్రస్తుతం బీజేపీ ఎత్తుగడల వల్ల చిత్తుగా మోసపోనున్నదని ఆయనేనన్నారు. బీజేపీతో పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదని అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరేనంటూ గొప్పలు చెప్పుకున్న ఈపీఎస్ ఐటీ, ఈడీ దాడులకు భయపడి బీజేపీ జాతీయ నేతల గులాముగా మారి ఆ పార్టీతోనే పొత్తుపెట్టుకున్నారని స్టాలిన్ ఆరోపించారు. ఈ సభలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, మెయ్యనాథన్, ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి ఏకేఎస్ విజయన్, టాడ్కో చైర్మన్ ఇలయరాజా, పార్లమెంట్ సభ్యురాలు సుధా, శాసనసభ్యులు నివేదా మురుగన్, పన్నీర్‌సెల్వం, రాజ్‌కుమార్, జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మనపందల్ గ్రామంలో ఓ కుటుంబానికి 'ఏకతాటిపై తమిళనాడు' కార్యక్రమం గురించి వివరిస్తున్న స్టాలిన్

సభ్యత్వ కార్యక్రమంలో...

ముఖ్యమంత్రి స్టాలిన్ మైలాడుదురై పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం కుత్తాలం సమీపం వళువూరులో ఎనిమిది అడుగుల మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఆ తర్వాత మనపందల్ గ్రామంలో 'ఏకతాటిపై తమిళనాడు' పేరుతో సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. అక్కడున్న ఇళ్ల వెళ్లి డీఎంకే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ముద్రించిన కరపత్రాలను అందించారు. ఆ తర్వాత పార్టీ సభ్యత్వ ఫారాలను అందజేసి డీఎంకేలో చేరమంటూ విజ్ఞప్తి చేశారు. ఆ ఇళ్ళలో చాలా మంది స్టాలిన్ నుండి పార్టీ సభ్యత్వం పుచ్చుకున్నారు. ఆ సందర్భంగా ప్రతి ఇంటిలో కూర్చుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలేవైనా ఉంటే ఉంగలుడన్ స్టాలిన్ విజ్ఞప్తుల స్వీకరణ శిబిరాలలో వినతిపత్రాలు సమర్పించాలని సూచించారు.



ఖైదీలు సెల్‌ఫోన్ వాడకానికి బ్రేక్



- సెంట్రల్ జైళ్లలో డామినెంట్ టవర్లు

టి.నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జైలుశిక్ష అనుభవిస్తూనే సెల్‌ఫోన్ల ద్వారా బయటిప్రపంచంతో కార్యకలాపాలు సాగిస్తున్న ఖైదీలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని జైళ్ల శాఖ నిర్ణయించింది. జైళ్లలో సెల్‌ఫోన్ సిగ్నళ్లను స్తంభింపజేసేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేథోపరిజ్ఞానం)తో 'డామినెంట్ టవర్స్' అనే నెట్‌వర్క్ టవర్స్‌ను ఏర్పాటు చేయడానికి అధికారులు సన్నాహాలు చేపడతున్నారు. రాష్ట్రంలో 9 సెంట్రల్ జైళ్లు, 149 జిల్లా జైళ్లు, 5 మహిళా జైళ్లు, 82 సబ్ జైళ్లు, 3 ఓపెన్ ఎయిర్ జైళ్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ జైళ్లలో సుమారు 20 వేలకు పైగా ఖైదీలున్నారు. మొత్తం ఖైదీల్లో 60 శాతం మంది సెంట్రల్ జైళ్లలో ఉన్నారు. సెంట్రల్ జైళ్లలోకి వచ్చే వస్తువులు, దుస్తులను స్కానర్‌తో తనిఖీ చేసిన మీదటే అనుమతిస్తున్నారు. అయినా ఆ నిఘా వర్గాల కళ్లుగప్పి జైళ్లలోని ఖైదీలకు గంజాయి, బీడీలు, సిగరెట్లు, మొబైల్ ఫోన్లు సరఫరా అవుతున్నాయి. ఖైదీలు మొబైల్ ఫోన్లు వాడకుండా ఉండేందుకు 2017లో సెంట్రల్ జైళ్ల వద్ద జామర్లను ఏర్పాటు చేశారు. అయితే ఈ జామర్లు 2జి, 3జి మొబైల్‌ఫోన్లకు మాత్రమే ఆపగలుగుతాయి. ప్రస్తుతం 4జి, 5జి రకం మొబైల్‌ఫోన్ల వినియోగం రావటంతో జైళ్లలోని ఖైదీలు ఈ రకం మొబైల్‌ఫోన్లను చాటుమాటుగా ఉపయోగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గత రెండున్నరేళ్లలో పుళల్ సెంట్రల్ జైలులో ఖైదీల నుండి 101 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని 141 మంది ఖైదీలపై కేసులు నమోదు చేశారు.

తీహార్ జైలు తరహాలో టవర్లు...

ఈ పరిస్థితుల్లో ఖైదీల మొబైల్ ఫోన్ల ఉపయోగాన్ని నిరోధించేందుకు దేశంలోనే తొలిసారిగా తీహార్ సెంట్రల్ జైలులో అమలుచేసిన 'డామినెంట్ టవర్స్' సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రంలోని సెంట్రల్ జైళ్లలోనూ ఏర్పాటు చేయాని అధికారులు నిర్ణయించారు. ఏఐ సహాయంతో పనిచేసే డామినెంట్ సెల్‌టవర్లు 4జి, 5జి మొబైల్‌ఫోన్లు సహా అన్ని మొబైల్ ఫోన్లను పనిచేయకుండా అడ్డుకుంటాయి. ఎస్ఎంఎస్‌లు, ఇంటర్నెట్ కనెక్షన్లు కూడా పొందలేరు. కర్నాటకలోని బెంగళూరు పరపన అగ్రహారం జైలులో గత యేడాది ఈ టవర్లు ఏర్పాటు చేసి ఖైదీల మొబైల్ ఫోన్ల వాడకాన్ని పూర్తిగా నిరోధించగలిగారు. ప్రస్తుతం ఈ టవర్లను అన్ని సెంట్రల్ జైళ్లలో అమర్చేందుకు కర్నాటక హోంమంత్రిత్వ శాఖ చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొదటిసారిగా పుళల్ సెంట్రల్ జైలు వద్ద డామినెంట్ టవర్లను ప్రయోగాత్మకంగా అమర్చేందుకు సిద్ధమవుతున్నారు.

విజయ్‌తో పొత్తుకు ఓపీఎస్ సన్నాహాలు

టినగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) అంగీకరిస్తే ఆ పార్టీలో విలీనం కావటం, లేకుంటే సొంతంగా పార్టీ ఏర్పాటు చేసుకుని బీజేపీ నేతృత్వంలోనే ఎన్డీయేలో చేరడమే ప్రధాన ప్రత్యామ్నాయాలుగా ఇంతకాలం నడిచిన మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం.. తాజాగా మూడో మార్గాన్ని కూడా ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. తన రాజకీయ భవిష్యత్తు కోసం ఆయన తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో పొత్తు పెట్టుకోవడంపైనా తాజాగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. 2021 నుండి ఓపీఎస్ రాజకీయ పయనం సవ్యంగా సాగలేదు. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైనప్పటి నుండి, తాజాగా ఆ పార్టీని హస్తగతం చేసుకునే ప్రయత్నాలకు బీజేపీ సహాయ సహకారాలందించకపోవడంతో ఓపీఎస్ వర్గీయులు పతనావస్థకు చేరుకున్నారు. వీకే శశికళ, దినకరన్‌తో చేతులు కలిపినా ఆయనకు పెద్దగా ఫలితం కనిపించలేదు. దీంతో అన్నాడీఎంకేలో విలీనం కావటానికి సిద్ధమేనని ఈపీఎస్‌కు సంకేతాలు పంపారు. తన ప్రకటనకు అన్నాడీఎంకే నుంచి మంచి స్పందన లభిస్తుందని ఆశలు పెట్టుకున్న ఓపీఎస్‌కు చివరకు నిరాశే ఎదురైంది. ఈ పరిస్థితుల్లోనే సెప్టెంబర్ 4న మదురై తన వర్గీయులతో అట్టహాసంగా మహానాడు జరిపేందుకు ఓపీఎస్ సిద్ధమయ్యారు. ఆ మహానాడులో దక్షిణాది జిల్లాల్లో తనకున్న పలుకుబడిని ప్రదర్శించేలా లక్షల సంఖ్యలో కార్యకర్తలను సమీకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ మహానాడులో శశికళ, దినకరన్ కూడా పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో తన రాజకీయ మనుగడకు ముప్పువాటిల్లకుండా సొంతంగా పార్టీని ఏర్పాటు చేసుకుని, విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో పొత్తు కుదుర్చుకోవాలని ఓపీఎస్ భావిస్తున్నట్లు తెలిసింది. ఆ మేరకు ఓపీఎస్ ఇప్పటికే విజయ్‌కు సంకేతాలు పంపినట్లు తెలిసింది. అయితే అటునుంచి అంతంతమాత్రంగానే స్పందన వచ్చినట్లు సమాచారం.



ఓపీఎస్, ఆయన అనుచరులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుబ్రమణ్యం

మెడికల్ కోర్సుల అడ్మిషన్లకు 30న కౌన్సెలింగ్

- ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్యకోర్సులలో ప్రవేశానికి సంబంధించిన కౌన్సెలింగ్ ఈ నెల 30న ప్రారంభమవుతుందని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ఉదయం తన సొంత నియోజకవర్గమైన సైదాపేటలో కోడంబాక్కం జోన్ 140వ వార్డులోని చెన్నై (కార్పొరేషన్) బాలుర మహోన్నత పాఠశాల (మాంతోప్పు స్కూలు)లో రూ.5.25 కోట్లతో నిర్మించే ఆడిటోరియం పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్‌జోన్ డిప్యూటీ కమిషనర్ హెచ్‌ఆర్. కౌశిక్, కోడంబాక్కం జోనల్ కమిటీ అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, కార్పొరేటర్ ఎం.శ్రీధరన్. జోనల్ ఆఫీసర్ పి. మురుగేశన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులలో ప్రవేశానికి 72,743 మంది దరఖాస్తు చేశారని, దరఖాస్తుతోపాటు విద్యార్హత తదితర ధ్రువ పత్రాలను జతచేయలేనివారికి రెండు రోజుల అవకాశం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్ కోసం నకిలీ ధ్రువ పత్రాలను సమర్పించిన విద్యార్థుల దరఖాస్తులను తిరస్కరించడమే కాకుండా వారు మెడికల్ కోర్సుల్లో ప్రవేశించడానికి మూడేళ్ళపాటు నిషేధం విధిస్తామని ఆయన హెచ్చరించారు.

సంకీర్ణమని అమిత్‌షా చెప్పలేదు

- ఈపీఎస్

ప్యారీస్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటవుతుందని కేంద్రమంత్రి అమిత్‌షా చెప్పలేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మరోమారు స్పష్టం చేశారు. అన్నాడీఎంకే తరుపున చేపట్టిన అసెంబ్లీ ఎన్నికల ప్రచార పయనంలో భాగంగా బుధవారం కడలూరు జిల్లా చిదంబరంలో ఈపీఎస్ రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026లో అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో బీజేపీ, టీఎంసీ, పురచ్చి భారదం- తదితర పార్టీలతో ఏర్పాటైన కూటమికి అన్నాడీఎంకే నాయకత్వం వహిస్తుందని, తమ కూటమిలో ఎలాంటి విభేదాలు లేకుండా విజయమే లక్ష్యంగా ఉందన్నారు. కేంద్రహోం మంత్రి అమిత్‌షా పలు సందర్భాల్లో మాట్లాడుతూ, తమిళనాడులో అన్నాడీఎంకే నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటవుతుందని చెప్పలేదని, కూటమి మద్దతుతో అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని, ప్రజలు తమను మెజారిటీ సీట్లలో గెలిపిస్తారని ఈపీఎస్ నమ్మకం వ్యక్తం చేశారు. పీఎంకేలో తండ్రీకొడుకుల మధ్య నెలకొన్న విభేదాలు త్వరలో సర్దుమనుగుతాయని, ఆ పార్టీ తమ కూటమిలోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామని, అదేవిధంగా మరికొన్ని పార్టీలు కూడా తమ కూటమిలోకి వస్తాయన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ప్రజలనుంచి స్వీకరించిన వినతిపత్రాలు ఏమయ్యాయని ఈపీఎస్ ప్రశ్నించారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా వ్యవహరించిన జయలలిత 'అమ్మ పథకం' ప్రవేశపెట్టారని, అప్పుడు రెవెన్యూ శాఖ అధికారులు రాష్ట్రంలోని ఒక్కొక్క గ్రామానికి వెళ్ళి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన డీఎంకే ఆ పథకాలకు స్టిక్కర్లు అంటించి తమవంటూ ప్రజలను మభ్యపెడుతోందని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోని సీఎం స్టాలిన్ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో కొత్త పథకాలు తీసుకురావడం హాస్యాస్పదమని ఈపీఎస్ విమర్శించారు.



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

పంచాయతీల్లో అనుమతిలేని భవనాల సీజ్

- కలెక్టర్లకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు

ప్యారీస్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో అనుమతిలేని నిర్మాణాలకు సీలు వేయాలని కలెక్టర్లకు రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ నిర్వాహక కమిషనర్ పొన్నయ్యన్ బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లకు సర్క్యులర్ జారీచేశారు. అందులో నగర, పంచాయతీల చట్టం 1971 విధులు 56, 57, 88 (ఎ), తమిళనాడు భవన అభివృద్ధి విధులు 2019 ప్రకారం అనుమతిలేకుండా గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణం చేపట్టకూడదు. భవన నిర్మాణ స్థలం, గ్రామం పేరు వివరాలను సమర్పించి ప్లాన్ అనుమతి పొందడంపై రాష్ట్ర ప్రభుత్వం ఏకీకృత విధానంలో మూడు రకాల నిబంధనలు చేసిందని తెలిపారు. దీని ప్రకారం 2,500 చ.అ, 3000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. కాగా భవనం 10 వేల చ.అ. తక్కువ ఉంటే దానికి స్థానిక సంస్థల నుంచి అనుమతి పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవల్సివుంటుంది. వీఏవో అనుమతిలేకుండా గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధం. ప్లాన్ ప్రకారం పనులు పూర్తిచేసి, నివేదికను సంబంధిత టెక్నికల్ అధికారికి సమర్పించాల్సివుంటుంది. భవనం ఆస్తి పన్ను విధింపులో ఉందా, లేదా అన్న వివరాలను ప్లానింగ్ కోసం సమర్పించే దరఖాస్తులో సూచించాల్సివుంటుంది. ఈ నిబంధనలు పాటించకుండా గ్రామీణ పంచాయతీల్లో నిర్మించిన భవనాలను పరిశీలించి విచారణ అనంతరం చర్యలు చేపట్టాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు పొన్నయ్యన్ ఉత్తర్వులు జారీచేశారు.

ఈసారి అధికారంలో మాకు భాగస్వామ్యం

- పీఎంకే నేత అన్బుమణి

ప్యారీస్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏడాది అధికారంలోకి రాబోయే ప్రభుత్వంలో భాగస్వామ్యం కోరుతామని పీఎంకే ఎంపీ అన్బుమణి పేర్కొన్నారు. పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) 37వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డాక్టర్ అన్బుమణి మీడియాతో మాట్లాడుతూ, మహా ఉద్యమం లాంటి పీఎంకేకు రాజకీయాల్లో మంచి భవిష్యత్తు ఉందని, ప్రజల సమస్యల కోసం ముందుండి పోరాడి సాధించగల సత్తా తమకు మాత్రమే ఉందన్నారు. రాష్ట్రంలో ఈ సారి అధికారంలోకి రాబోయే ప్రభుత్వంలో పీఎంకే కూడా తప్పకుండా భాగస్వామ్యం వహిస్తుందని అన్బుమణి పేర్కొన్నారు.



అంబేడ్కర్, కారల్ మార్క్స్, పెరియార్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న రాందాస్

ఇదిలా ఉండగా పీఎంకే ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విల్లుపురం జిల్లా దిండువనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో ఆ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ డాక్టర్ అంబేడ్కర్, కారల్ మార్క్స్, పెరియార్ విగ్రహాలకు నివాళులర్పించారు. పీఎంకే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాందాస్ మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వంలో, పార్టీలో భాగస్వామ్యం కావాలన్నదే అన్బుమణి అభిప్రాయమని, అయితే అది ఎన్నటికీ కార్యరూపం దాల్చబోదన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని అధిక స్థానాల్లో గెలిపించేలా కార్యకర్తలు ఇప్పటినుంచే సైనికుడిలా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సమాచార దృష్టి

ఒకే రోజు ఆరు విమానాల రద్దు

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తగిన సంఖ్యలో ప్రయాణికులు లేకపోవడంతో నగరం నుంచి వెళ్లాల్సిన, నగరానికి రావాల్సిన ఆరు విమానాలు బుధవారం రద్దయ్యాయి. సింగపూర్, ముంబై తదితర నగరాలకు వెళ్లే విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు విమానాల రద్దు విషయం తెలియజేసి, వారు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

28న చెంగల్పట్టు జిల్లాకు సెలవు

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాకు కలెక్టర్ ఈ నెల 28వ తేది సెలవు ప్రకటించారు. మేల్‌మరువత్తూర్‌లో జరుగనున్న ఆడిపూరం ఉత్సవాల సందర్భంగా 28న జిల్లాకు సెలవు ప్రకటిస్తున్నట్లు, ఆ సెలవు భర్తీచేసేలా ఆగస్టు 9వ తేది పని దినంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కావేరి నది పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడం, కర్ణాటక డ్యాంల నుంచి విడుదల చేస్తున్న నీరు తగ్గించడంతో సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు ఇన్‌ఫ్లో తగ్గింది. బుధవారం డ్యాంలోకి 17,235 ఘనపుటడుగుల నీరు వస్తుండగా, డెల్టా సాగుకు 18,00 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 119.56 అడుగులతో 92.77 టీఎంసీల నీటి నిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

సహకార శాఖ ఆధ్వర్యంలో 'కాల్ టాక్సీ'

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్‌లో అద్దె కార్ల యజమానులతో కలసి సహకార సంఘం కాల్ టాక్సీ సేవలు ప్రారంభించింది. కార్పొరేట్ టాక్సీల ఆధిపత్యం తగ్గించేలా టాక్సీ యజమానులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈరోడ్ అనంతరం సేలం, కడలూరులో ఇలాంటి సహకార టాక్సీలు ప్రారంభించనున్నామని, ఈ సహకార టాక్సీలకు ఆదరణ తెలపాలని కో-ఆప్ టాక్సీ అసోసియేషన్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

ప్రజాపనుల శాఖకే వర్సిటీ, కళాశాల భవనాల నిర్మాణం

వాషర్‌మెన్‌పేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖకు చెందిన విశ్వవిద్యాలయాలు, కళాశాల భవనాల నిర్మాణం, నిర్వహణ ప్రజా పనుల శాఖ చేపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. నిర్మాణ, నిర్వహణ పనుల కోసం సాంకేతిక విద్య డైరెక్టరేట్ కింద పనిచేస్తున్న సంస్థను రద్దు చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఆ బాధ్యతలు ప్రజా పనుల శాఖకు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేసింది.

ఐఎస్ఈఎస్ ఉద్యోగులకు 5 శాతం వేతనం పెంపు

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎడ్యుకేషన్ స్కీమ్ (ఐఎస్ఈఎస్) ఉద్యోగులకు 5 శాతం వేతనాలు పెంచారు. ఈ మేరకు సమగ్ర పాఠశాల విద్య రాష్ట్ర పథక డైరెక్టరేట్ అన్ని జిల్లాల ప్రధాన విద్యాధికారులకు సర్క్యులర్ జారీచేసింది. ఐఎస్ఈఎస్‌లో పనిచేస్తున్న ప్రోగ్రామర్, సివిల్ ఇంజనీర్, అకౌంట్స్ అండ్ ఆడిట్ మేనేజర్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, ఎస్ఎంసీ అకౌంటెంట్, డేటా ఎంట్రీ ఆఫీసర్, ఆఫీస్ అసిస్టెంట్ తదితరులకు 5 శాతం వేతనం పెంచారు. ఈ ఏడాది జూన్ 1వ తేది నుంచి పెంచిన వేతనం అందుబాటులోకి రానుంది. అదే సమయంలో, ప్రభుత్వ సర్వీసులో రిటైర్డ్ కన్సల్టెంట్లు, అసిస్టెంట్లకు ఇది వర్తించదు. జీతం పెంపు పొందడానికి ఒక సంవత్సరం పని అనుభవం తప్పనిసరి అని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.



అంతర్జాతీయ సర్పాల దినోత్సవం సందర్భంగా గిండి స్నేక్ పార్కులో కొండచిలువను ప్రదర్శిస్తున్న ఉద్యోగి

ఆగస్టు 25న టీవీకే ద్వితీయ మహానాడు

● మదురైలో భూమిపూజ



ముహూర్తపు రాట వేస్తున్న టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తదితరులు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) ద్వితీయ మహానాడు ఆగస్టు 25న మదురైలో భారీ స్థాయిలో నిర్వహించనున్నారు. మహానాడు కోసం ఎంపిక చేసిన స్థలంలో భూమి పూజ జరిగింది. ఈ మహానాడు మదురై -తూత్తుకుడి జాతీయ రహదారిలో టోల్‌గేట్ సమీపంలో ఉన్న పారపత్తి అనే ప్రాంతంలో ఉన్న 300 ఎకరాల స్థలంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం వేకువజాము ఐదు గంటలకు ముహూర్తపు రాట భూమి పూజ కార్యక్రమం ప్రారంభమైంది. టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ నాయకత్వంలో ఈ కార్యక్రమంలో పార్టీలోని వివిధవిభాగాలకు చెందిన నాయకులు, మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బుస్సీ ఆనంద్ ఇతర నాయకులు మదురై పోలీసు కమిషనర్ కార్యాలయానికి వెళ్లి మహానాడు నిర్వహణకు అనుమతి కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు విజయ్ తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం వెలువరిస్తూ మదురైలో జరుగనున్న ద్వితీయ మహానాడు రాష్ట్రంలో సరికొత్త చరిత్ర సృష్టించబోతోందని పేర్కొన్నారు.

ఆ దుర్ఘటనకు 21 యేళ్లు

● కుంభకోణం స్కూలు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారులకు నివాళి

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణం కాశిరామన్ వీధిలో 2004లో శ్రీకృష్ణా పాఠశాలలో సంభవించి అప్పుడే 21 ఏళ్లు పూర్తయ్యాయి. భారీ అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 94 మంది బాలబాలికలకు వారి కుటుంబీకులు, బంధువులు, స్థానిక ప్రజలు బుధవారం ఉదయం నివాళులర్పించారు. ఆ చిన్నారుల 21వ వర్ధంతి సందర్భంగా కుంభకోణం కాశిరామన్ వీధిలో అగ్ని ప్రమాదంలో అసువులు బాసిన 94 మంది చిన్నారుల ఫొటోలున్న బ్యానర్ కట్టి, కొవ్వొత్తులు వెలిగించి, పూలు చల్లి కుటుంబీకులు, స్థానిక రాజకీయ నేతలు, గ్రామపెద్దలు, విద్యాశాఖ అధికారులు నివాళులర్పించారు. అక్కడి నుండి ఆ చిన్నారులను ఖననం చేసిన శ్మశానవాటిక వరకు మౌన ర్యాలీ నిర్వహించారు. ఇదే విధంగా బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించిన ఆ ప్రైవేటు పాఠశాల వద్ద చిన్నారుల కుటుంబ సభ్యులు దీపాలు పట్టుకుని మహామఖం కొలను వరకు మౌన ర్యాలీ నిర్వహించి, కొలను గట్లపై మోక్ష దీపాలు వెలిగించారు.



చిన్నారుల ఫొటోలున్న బ్యానర్ వద్ద నివాళులర్పిస్తున్న ఓ బాలుడి కుటుంబీకులు

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు రూ.110 కోట్లు

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించే ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.110 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. 11 మందిలో ఒకరికి క్యాన్సర్ లక్షణాలు నిర్ధారణ అవుతుండగా, భవిష్యత్తులో కేసులు మరింత పెరిగే అవకాశముందని వైద్య విద్య, పరిశోధన డైరెక్టరేట్ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో, క్యాన్సర్ బాధితులకు చికిత్స అందించేలా రాయపేట ప్రభుత్వాసుపత్రి, కోవై ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రి, మదురై ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రి, తిరునల్వేలి ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో మండల క్యాన్సర్ ఆస్పత్రులు, పరిశోధన కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇవి మినహా రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 12 క్యాన్సర్ చికిత్సా కేంద్రాలు ఆధునిక వైద్య పరికరాలు ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో, ప్రాథమిక దశలోనే క్యాన్సర్ గుర్తించేలా వైద్య కళాశాల ఆస్పత్రుల్లో క్యాన్సర్ పరిశోధన, చికిత్సకు రూ.100.96 కోట్ల కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం, పరీక్షలకు అవసరమైన ఉపకరణాలు కొనుగోలు చేయాలని పేర్కొంది.

మందుల వ్యర్థాలు వేస్తే గూండా చట్టం

వాషర్‌మెన్‌పేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రాంతాల్లో మందుల వ్యర్థాలు వేసే వారిపై గూండా చట్టం నమోదుచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కాలపరిమితి చెందిన మందుల వ్యర్థాలు వేస్తుండడంతో, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారంపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ ప్రాంతాల్లో మందుల వ్యర్థాలు వేసే వారిపై గూండా చట్టం ప్రయోగించేలా చట్టసవరణ చేస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టింది. ఈ బిల్లుకు జూన్‌లో గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదం తెలిపారు. దీంతో, ఈ చట్టసవరణ ఈ నెల 8వ తేది నుంచి అమలుకు వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌లో తెలిపింది.


కోడియక్కరై తీరానికి డాల్ఫిన్ కళేబరం



చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా వేదారణ్యంలో సమీపంలో కోడియక్కరై సముద్ర ప్రాంతంలో ఇటీవల డాల్ఫిన్ల సంచారం అధికమైంది. తరచూ తీరం వైపు డాల్ఫిన్లు కనిపించి మాయమవుతుంటాయి. ఈ నేపథ్యంలో బుధవారం వేకువజాము కోడియక్కరై కొత్త లైట్‌హౌస్ ప్రాంతంలో ఓ డాల్ఫిన్ కళేబరం కొట్టుకు వచ్చింది. ఈ డాల్ఫిన్ కళేబరాన్ని గమనించిన పాదచారులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ జరుపుతున్నారు.

తాంబరం రైల్వేస్టేషన్‌లో కలకలం

● రైలింజన్ ఎక్కిన మహిళ



టి.నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తాంబరం రైల్వేస్టేషన్‌లో మంగళవారం రాత్రి అక్కడి రైలింజన్‌పై 40 యేళ్ల ఓ మహిళ గంటల తరబడి నిలబడటంతో ప్రయాణికులు, రైల్వేస్టేషన్ అధికారులు గమనించి దిగ్భ్రాంతి చెందారు. తాంబరం రైల్వేస్టేషన్ వద్ద ఈస్ట్, వెస్ట్ తాంబరం ప్రాంతాలు కలిసే చోట సబ్‌వే ప్రాంతం ఉంది. ఆ ప్రాంతంలో స్టేషన్‌లో హాల్ట్ అయ్యే రైళ్లను ఇంజన్ నుండి తొలగించిన తర్వాత బోగీలను తీసుకువెళ్లే రైలింజన్‌ను నిలిపి ఉస్తారు.. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఓ మహిళ ఆ సబ్‌వే వద్దనున్న రైలింజన్‌పైకి ఎక్కి చాలాసేపటి దాకా నిలబడింది. అది చూసినవారంతా ఆ మహిళ కరెంట్‌షాక్‌కు గురై ఉంటుందని అనుమానించారు. ఆలోగా ఈ విషయం తెలుసుకున్న తాంబరం రైల్వే భద్రతా విభాగం సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకుని రైలింజన్‌పై నిలిచి ఉన్న మహిళను బలవంతంగా కిందకు దించారు. 40 యేళ్ల ఆ మహిళకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు. రైల్వేపోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

టీవీకే పార్టీ జెండాలోని రంగుపై హైకోర్టులో కొత్త కేసు

వాషర్‌మెన్‌పేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) జెండాలో రంగులపై మద్రాసు హైకోర్టులో కొత్తగా కేసు దాఖలైంది. తొండై మండల సన్నోర్ ధర్మ పరిపాలన సభ అధ్యక్షుడు పచ్చయప్పన్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... తొండై మండల సన్నోర్ ధర్మ పరిపాలన సభ తమిళనాడు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విభాగంలో నమోదుచేసి ట్రస్టుగా పనిచేస్తుందన్నారు. ఈ సభ జెండా ఎరుపు, పసుపు రంగులతో రూపొందించామన్నారు. అలాగే, 2023లో ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కూడా పొందామని, ఆ ప్రకారం, నిర్దిష్ట రంగులు వినియోగించే హక్కు తమకు మాత్రమే ఉందన్నారు. కానీ, నటుడు విజయ్ 2024లో ప్రారంభించిన టీవీకే జెండాలో ఎరుపు, పసుపు రంగులున్నాయని, అందువల్ల టీవీకే జెండాలోని రంగులు తొలగించేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు. కాగా, టీవీకే జెండాలోని ఏనుగు చిహ్నాలు తొలగించాలని ఇప్పటికే బీఎస్పీ దాఖలుచేసిన కేసు విచారణలో ఉండగా, తాజాగా టీవీకే జెండాలోని రంగులు తొలగించాలంటూ కొత్త పిటిషన్ దాఖలుకావడం గమనార్హం. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానుంది.

ఆవిన్ కేసు విచారణకు మాజీమంత్రి హాజరు



మాజీమంత్రి రాజేంద్ర బాలాజీ

ప్యారీస్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలోని ఆవిన్ తదితర శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.3 కోట్లు మోసం చేసిన కేసులో మాజీమంత్రి రాజేంద్ర బాలాజీతో పాటు ఏడుగురు బుధవారం శ్రీవిల్లిపుత్తూరు కోర్టులో హాజరయ్యారు. విరుదునగర్ జిల్లా సాత్తూరుకు చెందిన అన్నాడీఎంకే నాయకుడు రవీంద్రన్ తన బంధువుకు ఆవిన్ సంస్థలో ఉద్యోగం కల్పిస్తామని నమ్మించి రూ.30 లక్షల నగదు తీసుకుని మోసం చేశారని 2021లో విరుదునగర్ ఆర్థిక నేర విభాగ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అన్నాడీఎంకేకు చెందిన విజయ్, నల్లతంబి, మారియప్పన్, మాజీమంత్రి రాజేంద్ర బాలాజీ తదితరులపై మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులోని ముద్దాయిలకు వ్యతిరేకంగా 2023 జనవరిలో ఆన్‌లైన్ ద్వారా శ్రీవిల్లిపుత్తూరు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో, రాజేంద్ర బాలాజీ మంత్రి పదవిలో ఉంటూ అవినీతి కేసులో చిక్కుకున్నందువల్ల ఈ కేసును మే 19వ తేదీన ప్రజా ప్రతినిధులకు వ్యతిరేకంగా నమోదైన అవినీతి కేసులపై విచారణ జరిపే న్యాయస్థానానికి బదిలీ అయ్యింది. బుధవారం ఉదయం ఈ కేసు విచారణకు కాగా, రాజేంద్ర బాలాజీతో పాటు ఏడుగురు విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం ఈ కేసు తదుపరి విచారణను ఆగస్టు 13కు వాయిదా వేస్తూ న్యాయమూర్తి జయకుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

తిరువణ్ణామలైలో వింత జంతువు దాడి వదంతులు మాత్రమే...!

● స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం



సామాజిక మాధ్యమాల్లో వెలువడిన వింత జంతువు చిత్రం

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై సమీపంలో ఓ వింత జంతువు మహిళపై దాడిచేసిందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు వదంతులు మాత్రమేనని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. తిరువణ్ణామలై జిల్లా తండరంపట్టు తాలూకా కీళవలస గ్రామం సమీపంలో ఓ వింత జంతువు సంచరిస్తోందని, ఆ జంతువు కొద్దిరోజుల క్రితం మహిళపై దాడిచేసిందనే వార్తలు, జంతువు చిత్రం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో కీళవలస సహా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ వ్యవహారంపై వివరణ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిజనిర్ధారణ బ్యూరో చేసిన పోస్ట్‌లో... ఈ వార్త పూర్తిగా అవాస్తవమని, పొగవాటి గోళ్లు, నాలుగు పాదాలు, మేక తల కలిగిన వింత మానవరూపి జీవి ఫొటో 2017లో సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారని తెలిపింది. ఇది 'మేక మనిషి' గ్రహాంతర వాసి అని అమెరికా సహా పలు దేశాల్లో వార్తలు వచ్చాయని తెలిపింది. ఇది 2011లో గ్రాఫిక్స్ పోటీల కోసం రూపొందించిన చిత్రం అని, దాని ఆధారం చేసుకుని తిరువణ్ణామలైలో వింత జంతువు సంచరిస్తోందంటూ వస్తున్న వార్తలు పూర్తిగా వదంతులు అని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

'సిబిల్ స్కోర్' వద్దంటూ రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సహకార పంట రుణాల మంజూరులో 'సిబిల్ స్కోర్' విధానం రద్దు చేయాలని కోరుతూ రైతులు ఆందోళన చేపట్టారు. ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘాల్లో పంట రుణాల మంజూరు సిబిల్ స్కోర్ తప్పనిసరి అని ప్రకటించారు.ఈవిధానం రద్దు చేయాలని కోరుతూ తిరుప్పూర్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ... పంట రుణాలకు సిబిల్ స్కోర్ తప్పనిసరి చేసే ప్రకటనను సత్వరం ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వాలు చేపడుతున్న రైతు వ్యతిరేక విధానాలు సత్వరం మానుకొని, పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ప్యారీస్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్‌హిల్స్ సమీపంలోని పుళల్‌లో టీ దుకాణం పైకప్పు వేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా... తిరువొత్తియూర్‌కు చెందిన సందీప్ (23) భవన నిర్మాణం పనులు చేస్తూ తమ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, మంగళవారం సాయంత్రం పుళల్ విజిటేరిన్‌నగర్‌లో ఉన్న ఓ టీదుకాణం పైకప్పు ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కు గురై సందీప్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

నంగనల్లూర్: భగత్‌సింగ్ నగర్, ముత్తు మహ్మద్ వీధి, పుళిదవాక్కం కార్పొరేషన్ కార్యాలయం, మెయిన్ రోడ్డు, రాజేశ్వరి నగర్, ఉల్లగరం, సెంగల్వరాయన్ వీధి, తంగవేలు వీధి, యూనియన్ కార్బైడ్ కాలనీ, వేలాయుధం వీధి.

పెరుంగుడి: అరింజర్ అన్నా 2 నుంచి 4 వీధులు, సరస్వతి నగర్ సౌత్ అండ్ నార్త్, పాండియన్ సాలై మెయిన్ రోడ్డు, సెంగాణియమ్మన్ ఆలయ వీధి, కుమరగురు అవెన్యూ 1 నుంచి 11 వీధులు, డా.అంబేడ్కర్ వీధి, కక్కన్ వీధి, తందైపెరియార్ వీధి, ముత్తుమారియమ్మన్ ఆలయ వీధి, ఎల్లయమ్మన్ ఆలయ వీధి, రూబి కాంప్లెక్స్, శివాలయం వీధి, ఈస్ట్ కోస్ట్ రోడ్డు, వాసన్ ఐ కేర్ హాస్పిటల్, వసంత భవన్ హోటల్స్

షోలంగనల్లూర్: రాజేష్ నగర్, అత్తిపురీశ్వరర్ వీధి, అష్టలక్ష్మి నగర్, కోవలన్ నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, పెరియార్ నగర్, కవిమణి వీధి, ఓంశక్తి నగర్.

కుండ్రత్తూర్: కుండ్రత్తూర్ మెయిన్ రోడ్డు, ఎమ్మెస్ నగర్, సెంథిల్ నగర్, బెల్ నగర్, శ్రీ జయేంద్ర సరస్వతి నగర్, అమ్మన్ నగర్, షణ్ముగ నగర్, జయలక్ష్మి నగర్, ఆర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్, సత్యనారాయణపురం, పొన్నియమ్మన్ ఆలయ వీధి, విఘ్నేశ్వర నగర్ కొంత భాగం, ఆర్ఈ నగర్ 6,7 వీధులు.

సేలయూర్: అంబేడ్కర్ నగర్, అగరం మెయిన్ రోడ్డు, జగజ్జీవన్ రామ్ నగర్, ఎయిర్‌మ్యాన్ ఎన్‌క్లేవ్, ఇందిరా నగర్ కొంత భాగం, ఐఏఎఫ్ రోడ్డు, లక్ష్మి అవెన్యూ మరియు ఎక్స్‌టెన్షన్, రాజకుమార్ అవెన్యూ, శక్తి అవెన్యూ, శ్రీనివాస నగర్, మాతా నగర్, సుమేరు సిటీ, సుందరం స్మార్ట్ సిటీ, కేవీఎన్ నగర్, రికి గార్డెన్, మారుతి అవెన్యూ, మహదేవన్ నగర్, హరిణి ఐశ్వర్యాలయం, న్యూ బాలాజీ నగర్ , ఎక్స్‌టెన్షన్, మురళి వీధి, అవ్వై వీధి, మాతా ఆలయ వీధి

ఆలందూర్: ఎంకేఎన్ రోడ్డు, అషర్‌ఖానా, ఆలందూర్ మెయిన్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, మార్కెట్ లైన్, జీఎస్టీ రోడ్డు, ఈశ్వరన్ ఆలయ వీధి, మదురై వీధి, కరుణీగర్ వీధి, ఏరికరై, ఆదంబాక్కం, శాంతినికేతన్ అపార్ట్‌మెంట్స్, మహాలక్ష్మి అపార్ట్‌మెంట్స్, గ్రోవ్ అపార్ట్‌మెంట్స్, మస్తాన్ గోరి అపార్ట్‌మెంట్స్, తిరువళ్లువర్ మెయిన్ రోడ్డు, వేళచ్చేరి రోడ్డు, పొన్నియమ్మన్ ఆలయ వీధి, ముత్యాలరెడ్డి వీధి, కుప్పుస్వామి కాలని, ఆఫీసర్ కాలని, కక్కన్ నగర్, ఎన్జీఓ కాలని, ఎస్బీఐ కాలని, మన్నాడిఅమ్మన్, పళందిఅమ్మన్ ఆలయన వీధి, రేస్ కోర్స్ ఏరియా, అంబేడ్కర్ నగర్, మదువాంకరై.

ముందస్తు బెయిలు కోరుతూ మదురై ఆధీనం పిటిషన్

● తీర్పు వాయిదా వేసిన న్యాయస్థానం

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ముందస్తు బెయిల్ కోరుతూ మదురై ఆధీనం దాఖలుచేసిన పిటిషన్ విచారించిన చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు, తేది ప్రకటించకుండా తీర్పు వాయిదావేసింది. గత మే 2వ తేది శైవసిద్ధాంత మహానాడులో తనను హతమార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ వ్యవహారంలో పాకిస్తాన్ ప్రమేయం ఉండవచ్చని, తన కారును ఢీకొన్న కారులోని వ్యక్తి కుల్లా ధరించి, గడ్డంతో ఉన్నాడని మదురై ఆధీనం పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. ఈ నేపథ్యంలో, మదురై ఆధీనం వ్యాఖ్యలు రెండు మతాల మధ్య చిచ్చుపెట్టేలా ఉన్నాయంటూ నగరానికి చెందిన న్యాయవాది రాజేంద్రన్ సైబర్ క్రైం పోలీసులకు అందజేసిన ఫిర్యాదు ఆధారంగా, ఆధీనంకు వ్యతిరేకంగా నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ కేసులో ముందస్తు బెయిలు కోరుతూ మదురై ఆధీనం తరపున చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ కేసు న్యాయమూర్తి కార్తికేయన్ విచారించగా, దురుద్దేశపూర్వకంగానే ఫిర్యాదు చేశారని, అందువల్ల ముందస్తు బెయిలు మంజూరు చేయాలని మదురై ఆధీనం తరపు న్యాయవాది వాదించారు. అందుకు అభ్యంతరం తెలిపిన పోలీసు శాఖ తరపు న్యాయవాది.. తన భావ ప్రకటనా స్వేచ్ఛను ఆధీనం దుర్వినియోగం చేశారని, అందువల్ల ఆయనకు ముందస్తు బెయిలు ఇవ్వరాదని వాదించారు. ఇరుతరపు వాదనల అనంతరం న్యాయమూర్తి, పిటిషన్‌పై తీర్పు తేది ప్రకటించకుండా వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పరందూరు విమానాశ్రయానికి స్థల సేకరణ ప్రారంభం

● 13 గ్రామాల ప్రజల ఆందోళన

ప్యారీస్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా పరందూరులో విమానాశ్రయానికి స్థలసేకరణ ప్రారంభించిన అధికారుల వైఖరిని ఖండిస్తూ 13 గ్రామాలకు చెందిన ప్రజలు ఏగనాపురం అంబేడ్కర్ విగ్రహం ముందు ధర్నాకు దిగారు. వీరికి పలు రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. ఈ విమానాశ్రయ పథకాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ సచివాలయాన్ని ముట్టడించనున్నట్లు ఆందోళకారులు హెచ్చరించారు.

కామరాజర్ సేవలు చిరస్మరణీయం

● కేటీసీటీలో జరిగిన జయంతి వేడుకల్లో వక్తలు



విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

ప్యారీస్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేటలోని కేటీసీటీ బాలికల మహోన్నత పాఠశాలలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ 123వ జయంతి వేడుకల్లో పాల్గొన్న వక్తలు రాష్ట్రాభివృద్ధి, విద్యారంగానికి ఆ మహనీయుడు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పాఠశాల గౌరవ కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో స్పాట్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ సుజాత రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులతో కలిసి కామరాజర్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పిచారు. ఈ వేడుకల్లో కేటీసీటీ మహోన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు తెలుగు, తమిళం, ఆంగ్ల భాషల్లో కామరాజర్ సేవల గురించి మాట్లాడి బహుమతులు సొంతం చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు అనిలా వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

చట్టవ్యతిరేక క్వారీలపై కఠిన చర్యలు

● హైకోర్టు ఉత్తర్వు

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేకంగా పనిచేస్తున్న క్వారీలపై కఠిన చర్యలు చేపట్టాలంటూ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఆదేశించింది. దిండుగల్ జిల్లాల్లో చట్టవ్యతిరేకంగా ఉన్న క్వారీలు మూసివేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ కేసు బుధవారం విచారించిన హైకోర్టు ధర్మాసనం... దేశ ఖనిజ సంపద దోపిడీ నిరోధించడం అధికారుల విధి అని, దిండుగల్ జిల్లా చట్టవ్యతిరేకంగా నడుస్తున్న క్వారీలు మూసివేయడంతో పాటు, వాటి నిర్వాహకులపై కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ధర్మాసనం ఆదేశించింది.

మాజీ ఎమ్మెల్యే మృతి.. పలువురి సంతాపం

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే అరివళగన్ గుండెపోటుతో మృతిచెందారు. కరూర్ జిల్లా కృష్ణరాయపురం నియోజకవర్గంలో రెండు సార్లు అన్నాడీఎంకే తరపున న్యాయవాది అరివళగన్ (72) పోటీచేశారు. ఆయన 1989లో కోడి చిహ్నం, 1991లో రెండాకుల చిహ్నంతో పోటీచేసి విజయం సాధించారు. అన్నాడీఎంకేలో తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆ పార్టీ నుంచి వైదొలిగి, డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అనంతరం, ఆ పార్టీ నుంచి వైదొలిగి, కరూర్ జిల్లా కార్యదర్శి, మాజీమంత్రి సెంథిల్ బాలాజి సమక్షంలో డీఎంకే తీర్థం పుచ్చుకున్నారు. కుళిత్తలై కావేరి నగర్‌లోని నివాసంలో ఉంటున్న అరివళగన్, మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు సరస్వతి అనే భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి అన్నాడీఎంకే, డీఎంకే సహా పలు పార్టీల నేతలు సంతాపం ప్రకటించారు.

లైంగిక వేధింపుల కేసులో 20 ఏళ్ల జైలు

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లో లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు నిచ్చింది. 2023లో మైలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 8 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు గురిచేసాడనే ఫిర్యాదుపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ కేసు మద్రాసు హైకోర్టు ప్రాంగణంలోని పోక్సో కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో, నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెలువరించినట్లు గ్రేటర్ చెన్నై పోలీసు కార్యాలయం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

కరుణానిధి విగ్రహంపై నల్ల రంగు కేసులో 77 ఏళ్ల వైద్యుడి అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సేలంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహంపై నల్లరంగు పూసిన వ్యవహారంలో 77 ఏళ్ల వైద్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సేలం నాలుగు రోడ్ల జంక్షన్ సమీపంలోని అన్నా పార్క్‌లో ఉన్న కరుణానిధి విగ్రహానికి నల్లరంగు పూసారు. మంగళవారం ఉదయం పార్క్‌లో జాగింగ్ వచ్చిన ప్రజలు, విగ్రహం పీఠంపై నల్లరంగు పూసి ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. సమాచారం అందుకున్న ఏసీపీ అశ్విని, అస్తంపట్టి సీఐ తవమణి నేతృత్వంలోని పోలీసు బృందం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ప్రాంతానికి వేలిముద్రల నిపుణులను రప్పించారు. అలాగే, ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీ పరిశీలించగా, ఓ వృద్ధుడు పెయింట్ డబ్బాతో అక్కడ సంచరిస్తుండడం నమోదైంది. ఈ వ్యవహారంలో 77 ఏళ్ల వైద్యుడు విశ్వనాథన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

టి.నగర్ ఈస్ట్ ఎన్ఆర్ఐ వింగ్ ఆర్గనైజర్‌గా పీజే ప్రవీణ్



ఎమ్మెల్యే కరుణానిధిని సన్మానిస్తున్న పీజే ప్రవీణ్

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): డీఎంకే సీనియర్ నేత, తెలుగు ప్రముఖుడు పీజే ప్రవీణ్ టి.నగర్ ఈస్ట్ ఎన్ఆర్ఐ వింగ్ ఆర్గనైజర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు డీఎంకే కార్యదర్శి ఎంఎం అబ్దుల్లా ప్రకటన విడుదల చేశారు. టి.నగర్ ఎమ్మెల్యే కరుణానిధికి సన్నిహితుడైన ప్రవీణ్.. సుదీర్ఘకాలంగా పార్టీ కార్యకలాపాల్లో కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా తనకు ఎన్ఆర్ఐ వింగ్ నిర్వాహకుడి పదవికి సిఫారసు చేసిన ఎమ్మెల్యే కరుణానిధిని బుధవారం ప్రవీణ్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్ఆర్ఐల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

చిత్రజ్యోతి



క్లాప్ కొడుతున్న తిరుపూర్ సుబ్రమణియం

హీరో జీవా 46వ చిత్రం ప్రారంభం

నిర్మాత ఆర్.బి.చౌదరి కుమారుడు జీవా హీరోగా నటించే 46వ చిత్రం పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. హీరో విశాల్, నిర్మాత ఆర్‌బీ చౌదరి, తమిళనాడు థియేటర్, మల్టీప్లెక్స్ యజమానుల సంఘం అధ్యక్షుడు తిరుపూరు సుబ్రమణియం తదితరులు పాల్గొని, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. హీరో జీవాపై తిరుపూర్ సుబ్రమణియం తొలి క్లాప్ కొట్టారు. ఇదిలా ఉండగా ఈ మూవీలో హీరోయిన్‌గా రబియ కదూన్ నటిస్తుండగా, ఇతర పాత్రల్లో బబ్లూ పృథ్వీరాజ్, నైలా ఉష, ఆగుకలం నరేన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కేజీ గ్రూపు పతాకంపై కన్నన్ రవి నిర్మిస్తుండగా 'బ్లాక్' ఫేం కేజీ బాలసుబ్రమణి దర్శకత్వం వహిస్తున్నారు.

అంచనాలు లేకుండా ప్రేక్షకుడు సినిమాకు వెళ్ళాలి

● దర్శకుడు గోపి



ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న చిత్ర బృందం

ప్రేక్షకుడు ఎలాంటి అంచనాలు లేకుండా సినిమాకు వెళ్ళాలని అపుడే అతనికి ఆ సినిమాపై ఒక క్లారిటీ వస్తుందని చిత్ర దర్శకుడు గోపి అన్నారు.బ్రేకింగ్ పాయింట్ పిక్చర్స్ పతాకంపై ఎం.గోపి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యాదుమ్ అరియాన్'. ఈ సినిమా ద్వారా దినేష్ హీరోగా పరిచయమవుతున్నారు. హీరోయిన్‌గా ప్రాణ నటించారు. విజయ్ టీవీ కేపీపై ఆనంద్, శ్యామల్, అప్పుకుట్టి తదితరులు ఇతర పాత్రలు పోషించారు. కాగా ఈ నెల 18వ తేదీ ఈ చిత్రం విడుదలను పురస్కరించుకుని ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నగరంలో తాజాగా నిర్వహించారు. ఇందులో సినీ దర్శకుడు పేరరసు, స్టంట్ మాస్టర్ కనల్ కణ్ణన్, నటుడు సౌందరరాజన్, ఎడిటర్ టీఎస్ సుభాష్, దర్శక నటుడు ఈవీ గణేష్, నటుడు సంపత్ రామ్ తదితరులు హాజరై చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు గోపి మాట్లాడుతూ, 'ట్రైలర్‌లో చూసిన అన్ని సన్నివేశాలూ సినిమాలో ఉంటాయి. వాటిలో ఏ ఒక్కటి సెన్సార్ బోర్డు తొలగించలేదు. సినిమా గురించి మాట్లాడాలంటే కాస్త భయంగా ఉంది. మినిమమ్ బడ్జెట్‌తో, అతి తక్కువ కాలంలో సినిమా తెరకెక్కించాం. నేను హీరో విజయ్ అభిమానిని. ఆయన రిఫరెన్స్ నా తదుపరి చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. హీరో దినేష్ మాట్లాడుతూ, 'నేను కూడా మీడియా రంగం నుంచే ఇక్కడకు వచ్చాను. ఇపుడు హీరోగా మీ ముందుకు ఉన్నాను. మీరంతా సపోర్టు చేసి హీరోగా నిలబెట్టి, చిత్రాన్ని సక్సెస్ చేయాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు.

సినీ సమస్యలకు ప్రభుత్వమే కారణం

● ఆర్వీ ఉదయకుమార్



'వళ్లిమలై వేలన్' ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్ర పరిశ్రమలో నెలకొన్న అనేక సమస్యలకు ప్రభుత్వమే కారణమని ప్రముఖ దర్శకుడు, కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్ ఆరోపించారు. ఈ సమస్యలకు ప్రభుత్వమే పరిష్కార మార్గం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఎంఎస్‌ఆర్ పిక్చర్స్ పతాకంపై ఎం.నాగరత్నం నిర్మించగా, దర్శకుడు ఎస్.మోహన్ దర్శకత్వంలో రూపొందిన 'వళ్లిమలై వేలన్' ఆడియో విడుదల ఇటీవల చెన్నైలో జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఆర్వీ.ఉదయకుమార్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలోని పాటలు చాలా బాగున్నాయి. సినిమా రంగంలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వమే నడుం బిగించి అన్నింటిని ఒక పద్ధతిలో చక్కదిద్దాలి. ఈ విషయాలను ఎవరూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడం లేదు. చిన్న సినిమాను తీసి, దానిని విడుదల చేసేందుకు నిర్మాతలు పడరాని పాట్లు పడుతున్నారు. రిలీజ్‌కు థియేటర్లు లభించడం లేదు. ఈ పరిస్థితులు మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని అన్నారు. 'మమ్మల్ని ఆశీర్వదించేందుకు వచ్చిన సినీ ప్రముఖులు హృదయపూర్వక ధన్యవాదాలు అని నిర్మాత, హీరో నాగరత్నం అన్నారు. ఆ తర్వాత సంగీత దర్శకుడు ఆల్‌డ్రిన్, హీరోయిన్ ఇలక్కియతదితరులు ప్రసంగించారు.



సోషల్ మీడియాను షేక్ చేస్తున్న 'మోనికా'

ప్రముఖ హీరోయిన్ పూజా హెగ్డే సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ - దర్శకుడు లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'కూలీ' చిత్రంలోని 'మోనికా' అనే ప్రత్యేక గీతంలో పూజా హెగ్డే నర్తించారు. ఈ పాట లిరికల్ వీడియో తాజాగా రిలీజ్ చేయగా, ఈ సాంగ్‌కు అదిరిపోయే స్పందన వచ్చింది. యూట్యూబ్‌లో ఈ పాటను బుధవారం మధ్యాహ్ననికి 1,50,75,900 మంది నెటిజన్లు వీక్షించారు. పూజా హెగ్డే నృత్యం, హావభావాలు ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తమిళంలోనే కాకుండా, తెలుగులో కూడా ఈ పాటకు విశేష ఆదరణ లభించడం గమనార్హం. కాగా, గతంలో రజనీకాంత్ నటించిన 'జైలర్' చిత్రంలో మిల్కీబ్యూటీ తమన్నా 'కావాలా..' అనే ఐటమ్ సాంగ్ చేశారు. ఈ పాట సరికొత్త రికార్డులను సృష్టించింది. ఇపుడు పూజా హెగ్డే నటించిన 'మోనికా' ప్రత్యేక గీతానికి కూడా అదేస్థాయిలో స్పందన వచ్చింది. దీంతో 'కావాలా' పాటను 'మోనికా' సాంగ్ బీట్ చేస్తుందా అనే చర్చ కోలీవుడ్‌లో మొదలైంది. తమిళ చిత్రపరిశ్రమలో తమన్నా స్థాయిలో పూజా హెగ్డేకు గుర్తింపు లేదు. కానీ, విజయ్ నటించిన 'బీస్ట్' చిత్రంలోని 'అరబి కుత్తు', సూర్య మూవీ 'రెట్రో'లోని 'కనిమా' పాటతో తమిళ ప్రేక్షకులకు చేరువైన విషయం తెల్సిందే. ఈ రెండు పాటలు బాగా పాపులర్ అయ్యాయి.



భవిష్యత్‌లో మూడు రోజుల తర్వాతే యూట్యూబ్ రివ్యూలు

● విశాల్ విజ్ఞప్తి

అడయార్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో కొత్త సినిమా విడుదలైన మూడు రోజుల తర్వాతే థియేటర్ ప్రాంగణంలో పబ్లిక్ రివ్యూలకు అనుమతించాలని విజ్ఞప్తి చేయనున్నట్టు నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్ తెలిపారు. బుధవారం నగరంలో జరిగిన ఒక సినిమా ఆడియో రిలీజ్ వేడుకలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'భవిష్యత్‌లో ఒక సినిమా విడుదలైన మూడు రోజుల తర్వాత అంటే 12షోలు ప్రదర్శించిన తర్వాతే థియేటర్ ప్రాంగణంలో పబ్లిక్ రివ్యూల కోసం అనుమతించాలని,దానికంటే ముందు అనుమతించవద్దని థియేటర్ యాజమాన్యాలతో పాటు నిర్మాతలకు, పంపిణీదారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అవసరమైతే థియేటర్ బయట పబ్లిక్ టాక్ తీసుకోవచ్చని లేదా యూట్యూబర్లు సినిమా చూసి వారే రివ్యూలు రాసుకోవాలన్నారు. సినిమాను రక్షించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.ఇదిలా ఉండగా మరో రెండు నెలల్లో తన వివాహం జరుగుతుందని, ఈలోగా నడిగర్ సంఘం భవన సిద్ధమవుతుందన్నారు. ఆగస్టు 29వ తేదీ ఓ కీలక ప్రకటన చేస్తామన్నారు. నడిగర్ సంఘం భవన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు తాము పరుగెత్తుతున్నామన్నారు. కాగా, ఆగస్టు 29న హీరోయిన్ సాయి ధనిష్కకు తనకు వివాహమని గతంలో విశాల్ ప్రకటించిన విషయం తెల్సిందే.

రూ.9 కోట్ల నష్టపరిహారం చెల్లించాలి

● హైకోర్టులో రవి మోహన్ పిటిషన్



రవి మోహన్

అడయార్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు నిర్ణీత సమయంలో సినిమా చిత్రీకరణ పూర్తి చేయనందుకు రూ.9 కోట్ల నష్టపరిహారం చెల్లించేలా నిర్మాణ సంస్థను ఆదేశించాలని హీరో రవి మోహన్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌కు కౌంటర్ దాఖలు చేయాలని సంబంధిత నిర్మాణ సంస్థను కోర్టు ఆదేశించింది. కోవైకి చెందిన బాబీ టచ్ గోల్డ్ యూనివర్స్ అనే నిర్మాణ సంస్థ తనతో రెండు సినిమాలు నిర్మించేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ అగ్రిమెంట్ మేరకు చిత్ర నిర్మాణాలు ప్రారంభించని కారణంగా తనకు ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయంటూ రవి మోహన్ తరపు న్యాయవాదులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి అబ్దుల్ ఖుద్దూస్ సమక్షంలో విచారణకు రాగా ఈ పిటిషన్ విచారణార్హమైనదని, ఒప్పందాన్ని ఉల్లంఘించి హీరో రవి మోహన్ 'పరాశక్తి' సినిమాలో నటించారని నిర్మాణ సంస్థ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది పీఎస్ రామన్ కోర్టు దృష్టికి తీసుకెళ్ళారు. ఇరువర్గాల వాదనలు ఆలకించిన న్యాయమూర్తి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేశారు.

రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ

● విమాన ల్యాండింగ్ ట్రయల్ రన్



ఢిల్లీ నుంచి వచ్చిన భారీ విమానం

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన సందర్భంగా ఏర్పాట్లు వేగవంతం చేశారు. ఈ నెల 17న ప్రధాని రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో, తిరుచ్చి విమానాశ్రయంలో ప్రధాని రానున్న భారీ విమానం సురక్షితంగా ల్యాండింగ్ చేసేలా బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ భారీ విమానం మధ్యాహ్నం 12.25 గంటలకు తిరుచ్చి విమానాశ్రయంలో ల్యాండింగ్ చేశారు. అనంతరం 2.15 గంటలకు ఢిల్లీ బయల్దేరి వెళ్లింది. ప్రధాని పర్యటన నేపథ్యంలో అరియలూరు, పెరంబలూరు, తంజావూరు తదితర జిల్లాల్లో ముందస్తు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

ఘనంగా మరైమలై అడిగళ్ 150వ జయంతి



వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ ఆవిష్కరించిన మరైమలై అడిగళ్ పుస్తక తొలి ప్రతిని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆలూర్‌షా నవాజ్

ప్యారీస్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై వీఐటీ ప్రాంగణంలో తమిళ సాహితీవేత్త మరమలై అడిగళ్ 150వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా జరిగాయి.. తమిళ్ ఇయ్యక్కం ఛైర్మెన్, వీఐటీ ఛాన్సలర్ డాక్టర్ కె.విశ్వనాథన్ సభాధ్యక్షుడిగా వ్యవహరించి 'మరైమలై అడిగళ్ జీవిత చరిత్రపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించగా, తొలి ప్రతిని ఎమ్మెల్యే ఆలూర్‌షా నవాజ్ స్వీకరించారు. కార్యక్రమంలో వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ, తమిళ భాష తర్వాత సంస్కృతం, తెలుగు, కన్నడం, మలయాళం, ఒడియా భాషలకు సెమ్మొళి అంతస్థు కల్పించారని, గత పదేళ్ళలో సంస్కృత భాషాభివృద్ధికి రూ.2,500 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం తమిళం, తెలుగు తదితర భాషల అభివృద్ధికి రూ.140 కోట్లు మాత్రమే కేటాయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వ తీరును అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం తమిళ భాషకు ప్రత్యేక్లంగా కాకుండా పలు మార్గాల్లో ప్రమాదం ఎదురవుతోందని, ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో తమిళ భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత తమిళ సంస్థలదేనని ఆయన సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ఆలూర్‌షా నవాజ్ మాట్లాడుతూ, ఈ ప్రపంచం ఉన్నంతవరకు తమిళం జీవించే ఉంటుందని, నేటి తరానికి పుస్తక పఠనం అలవాటు లేదన్నారు. పాఠ్యపుస్తకాలే కాకుండా ఇతర పుస్తకాలను చదవడం వల్ల విద్యార్థుల్లో జ్ఞానం పెరుగుతుందని తెలిపారు.



చెన్నైలోని 'శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్'లో బుధవారం 'ది బమ్మక్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్' అనే అంశంపై ప్రసంగించిన తిరువనంతపురంలోని చిత్రా తిరునల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ సంజయ్ బెహారిని సత్కరిస్తున్న వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎమా శేఖర్, డీన్ డాక్టర్ కె.బాలాజీ సింగ్

ఆలయాల ఆస్తులను వాటికే ఉపయోగించాలి

● హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వు



టి.నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆలయ ఆస్తులను కబ్జాదారుల నుండి స్వాధీనం చేసుకుని వాటిని ఆలయాల సంరక్షణకే ఉపయోగించాలని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వు జారీ చేసింది. సేలం జిల్లాకు చెందిన రాధాకృష్ణన్ అనే వ్యక్తి ఆ డివిజన్ బెంచ్‌లో ఓ పిటిషన్ దాఖలు చేస్తూ పుదుకోట కొన్నయూరు ముత్తుమారియమ్మన్ ఆలయానికి కోట్లాది రూపాయల విలువైన స్థిరాస్తులున్నాయని, అవన్నీ కబ్జాకు గురై ఉన్నా, దేవాదాయ శాఖ అధికారులు ఆ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆ విషయమై ోార్చిలో తాను ఆ శాఖకు వినతిపత్రం కూడా సమర్పించానని పేర్కొన్నారు. హిందూ దేవాదాయ శాఖ ఆలయ ఆస్తులను సక్రమంగా నిర్వహించి, ఆ ఆస్తుల నుంచి ఆలయానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు ఎస్ఎం.సుబ్రమణ్యం, ఎస్.శ్రీమతితో కూడా ధర్మాసనం విచారణకు జరిపిన మీదట హిందూ దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం ఆలయ ఆస్తులను కబ్జాదారుల నుండి స్వాధీనం చేసుకుని, ఆ ఆస్తులను ఆ ఆలయ సంరక్షణకే ఉపయోగించాలన్నారు. కొన్నయూరు ముత్తుమారియమ్మన్ ఆలయానికి చెందిన ఆస్తులను కబ్జాదారుల నుండి స్వాధీనం చేసుకుని వాటిని ఆ ఆలయ నిర్వహణ, సంరక్షణకే ఉపయోగించాలని ఉత్తర్వు జారీ చేశారు. ఈ విషయమై దేవాదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టినట్లు న్యాయస్థానం ఎదుట ధ్రువీకరించాలన్నారు. ఈ పిటిషన్‌ను పుదుకోట జిల్లా కలెక్టర్ పరిశీలించి చర్యలు చేపట్టాలని, ఆలయ ఆస్తులు ఆక్రమణదారుల నుండి స్వాధీనం చేసుకోవాలని ధర్మాసనం ఉత్తర్వు జారీ చేసింది.

మైనారిటీ ఓట్లు చీల్చేందుకే విజయ్‌కి బీజేపీ పరోక్ష మద్దతు

● స్పీకర్ అప్పావు ఆరోపణ



తిరునల్వేలిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అప్పావు

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో మైనారిటీల ఓట్లను చీల్చేందుకే కేంద్రంలోని బీజేపీ పాలకులు తమిళగవెట్రి కళగంకు మద్దతునిస్తున్నారని, ఆ పార్టీ నాయకుడు విజయ్ తల్లి క్రైస్తవురాలు కావడంతో, ఆ ఓట్లను చీల్చవచ్చునని కలలు కంటున్నారని స్పీకర్ అప్పావు విమర్శించారు. తిరునల్వేలిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల శివగంగ జిల్లా తిరుభువనం ఆలయ వాచ్‌మన్ లాకప్‌డెత్‌కు నిరసనగా టీవీకే ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో విజయ్ మాట్లాడిన మూడు నిమిషాల ప్రసంగాన్ని విన్నానని, గతంలో జరిగిన లాకప్‌డెత్ కేసుకు సంబంధించి జయరాజ్ ఫెన్సిక్ కేసులో మృతి చెందిన వ్యక్తిపేరు కూడా ఆయనకు తెలియలేదని, ఆ డైలాగులు ఎవరు రాసి చదవమని చెప్పారో తెలియటం లేదన్నారు. జయరాజ్ ఫెనిక్స్ కేసును సరిగా దర్యాప్తు జరుగకపోవడంవల్లే సీబీఐ విచారణకు సీఎం స్టాలిన్ కోరారని చెప్పారు. వాచ్‌మన్ అజిత్‌కుమార్ లాకప్‌డెత్‌తో సంబంధాలున్న వారందరిపైనా కేసులు నమోదయ్యాయని, ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయంగా అజిత్‌కుమార్ కుటుంబీకులకు భేషరతుగా క్షమాపణలు చెప్పుకున్నారని తెలిపారు. ఇటీవల టీవీకేలో ఆదాయపు పన్నుల శాఖకు చెందిన మాజీ అధికారి అరుణ్‌రాజ్ చేరడం వెనుక కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రమేయం ఉందంటున్నారని తెలిసిందన్నారు. కొన్నేళ్ళ క్రితం విజయ్ నివాసాల్లో ఐటీ దాడులు జరిగినపుడు అరుణ్‌రాజ్ జోక్యం చేసుకుని సానుకూలంగా వ్యవహరించారని, అందువల్లే ఆయన్ని పార్టీలో చేర్చుకున్నారని అప్పావు ఆరోపించారు. ఇక పుదుచ్చేరికి చెందిన బుస్సీ ఆనంద్‌కు అమిత్‌షాతో చిరకాల సంబంధాలున్నాయని తెలిపారు. విజయ్ అడగకపోయినా ఆయనకు 'వై' కేటగిరీ భద్రత కల్పించడం, ఆయనకంటూ ప్రత్యేకంగా ఓ విమానాన్ని కూడా కొనిచ్చారని ఇదంతా కేంద్రంలోని బీజేపీ పెద్దల చలువే కదా అని ఆయన ప్రశ్నించారు.

మణిపాల్ సిగ్నా 'సర్వా' బీమా పాలసీకి విశేష స్పందన



మీడియా సమావేశంలో సప్నా, అశీష్ యాదవ్ తదితరులు

అడయార్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రైవేటు బీమా కంపెనీల్లో ఒకటిగా గుర్తింపు పొందిన మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రవేశపెట్టిన 'సర్వా' పాలసీకి విశేష స్పందన లభిస్తుందని ఆ కంపెనీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సప్నా దేశాయ్, ప్రొడక్ట్స్ అండ్ ఆపరేషన్ హెడ్ అశీష్ యాదవ్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇదే విషయంపై వారు మాట్లాడుతూ, మణిపాల్ సిగ్నా సర్వా పాలసీ విక్రయాలు రికార్డు స్థాయిలో ఉన్నాయన్నారు. తమ కంపెనీ ఈ యేడాది జనవరి నుంచి మే వరకు చేసిన కొత్త వ్యాపారంలో ఈ పాలసీ విక్రయాలు 52 శాతం వాటా వున్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 11 లక్షలకు పైగా జీవిత బీమా పాలసీలను విక్రయించామన్నారు. అలాగే, తమ కంపెనీకి రాష్ట్రంలో 18 శాఖలతో పాటు 7 వేల మంది అడ్వైజర్లున్నారని, రూ.101 కోట్ల మేరకు క్లైయిమ్‌లను సెటిల్ చేసినట్టు వారు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా నాణ్యమైన ఆరోగ్య సంక్షణ అందుబాటులోకి తీసుకుని రావాలన్న ఏకైక లక్ష్యంతోనే తమ కంపెనీ ప్రతి ఒక్కరికీ అనుకూలమైన పాలసీలను అందుబాటులోకి తెస్తోందని వారు వివరించారు.

నవజాత శిశువుకు కంటి శస్త్రచికిత్స విజయవంతం



శస్త్రచికిత్స నిర్వహించిన శిశువుతో డా.వాసుమతి వేదాంతం

వాషర్‌మెన్‌పేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన దంపతులకు జన్మించిన నవజాత శిశువుకు రాధాత్రి నేత్రాలయ నిర్వహించిన కంటి శస్త్రచికిత్సలు విజయవంతమైంది. నవజాత శిశువుల్లో పలువురు జన్మత రెటినోపతి ఆఫ్ ప్రేమాట్యూరిటీ (ఆర్‌ఓపీ) అనే సమస్యతో బాధపడుతుంటారు. ఈ నేపథ్యంలో, నెల్లూరు దంపతులకు జన్మించిన శిశువు ఆర్వోపి సమస్యతో బాధపడుతోంది. వీరు, స్థానిక రాధాత్రి ఆసుపత్రిని సంప్రదించారు. రాధాత్రి నేత్రాలయ చిన్నపిల్లల రెటీనా స్పెషలిస్ట్ డా.వాసుమతి వేదాంతం నేతృత్వంలోని వైద్యులు, సిబ్బంది, నవజాతి శిశువుకు చేసిన శస్త్రచికిత్స విజయవంతమై, ఆమె తిరిగి కంటి చూపు పొందింది. గురుప్రియ విజన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన రాధాత్రి నేత్రాలయం ఇప్పటివరకు తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 1.50 లక్షల మంది నవజాత శిశువులకు ఆర్వోపీ చికిత్సలు అందించినట్లు ఆసుపత్రి నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.



మైలాడుదురైలో రహదారి పక్కనే నిలిచి తనకు నమస్కరించిన రష్యన్ యువతులను ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

సమస్యల పరిష్కారానికి చర్యలు

● పోలీసు కమిషనర్ అరుణ్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అరుణ్

పెరంబూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని నగర పోలీసు కమిషనర్ అరుణ్ పోలీసు అధికారులకు సూచించారు. వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అరుణ్ మాట్లాడుతూ... ప్రజల సమస్యలు తెలుసుకునేలా ప్రతి మంగళవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తెలిపే సమస్యలపై విచారణ చేపట్టి వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులను ఆదేశించినట్లు కమిషనర్ అరుణ్ తెలిపారు.

కెవిన్‌కేర్ నుంచి మీరా రైజ్ కంజీ షాంపూ ఆవిష్కరణ



ఐసిఎఫ్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కెవిన్‌కేర్ సంస్థ 'మీరా రైజ్ కంజి' పేరుతో కొత్త ఆవిష్కరణ మార్కెట్లోకి విడుదల చేసింది. బుధవారం చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ సంస్థ బిజినెస్ హెడ్ రజత్ నందా ఈ షాంపూను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బియ్యపు గంజి తరతరాలుగా ఉపయోగించే లోతైన, సాంప్రదాయ జుట్టు సంరక్షణ విధానమని తెలిపారు. మీరా రైజ్ కంజి షాంపూ ప్రారంభించడంతో ఈ స్వదేశీ జ్ఞానాన్ని ముందంజలోకి తీసుకురావడం పట్ల తాము గర్విస్తున్నట్లు తెలిపారు.రైస్ కంజి షాంపు సాచెట్ల నుంచి బాటిళ్ల వరకు అందుబాటులో వుందన్నారు. ఒక సాచెట్ ధర రూ. 2 కాగా, లీటరు బాటిల్ రూ.1312గా నిర్ణయించామన్నారు. ప్రస్తుతం ఈ షాంపూను దక్షిణ భారత మార్కెట్‌లో అందుబాటులో వుంచామని, ఆ తరువాత మరింత విస్తరిస్తామని తెలిపారు. ఈ ఆవిష్కరణతో కీలకమైన పట్టణ, గ్రామీణ మార్కెట్లలో మీరా పాదముద్రను విస్తరించడం, షాంపూ విభాగంలో తమ వాటను పెంచడం తమ ముందున్న లక్ష్యమని వివరించారు.

పుడమితల్లికి కాలుష్య ముప్పు

● ఎంఏకే ఛైర్మన్ మాణిక్కం



మాణిక్కం అతప్ప గౌండర్‌ను అభినందిస్తున్న రమేష్ రాజ్‌గోపాల్

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పుడమితల్లికి కాలుష్య ముప్పు పొంచివుందని, దీని పరిష్కారం కోసం అందరూ తమ వంతు కృషి చేయాలని ఎంఏకే ఇండియా లిమిటెడ్ ఛైర్మన్ మాణిక్కం అతప్ప గౌండర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన తమ సంస్థ జనరల్ మేనేజర్ రమేష్ రాజగోపాల్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. 2100 నాటికి విపరీతమైన కాలుష్యం కారణంగా జీవసృష్టికి భూమి సహకరించకపోవచ్చన్నారు. అందుకే దూరదృష్టితో చర్యలు చేపట్టాల్సి వుందన్నారు. మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు, ఘన వ్యర్థాలు, వాయు ఉద్గారాలు, దుర్వాసన వెదజల్లే డంప్‌లు వంటి అన్ని కాలుష్యాలకు పేటెంట్ పొందిన, క్షేత్రస్థాయిలో నిరూపితమైన, ప్రపంచంలోనే మొట్టమొదటి స్కేలబుల్ పరిష్కారం తమ వద్ద వుందని వివరించారు.




విశ్వజిత్ రాణే - ప్రణీత

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. గోవా మంత్రి విశ్వజిత్ రాణే, సినీ హీరోయిన్ ప్రణీత ఉన్నారు.

ఆధునికీకరించిన ల్యాబ్‌ను పరిశీలించిన ఈవో

తిరుమల, జూలై16(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పలు ప్రాంతాల్లో టీటీడీ ఈవో శ్యామలరావు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ అండ్ వాటర్ ల్యాబ్‌లో ఆధునీకరించిన యంత్రాలను పరిశీలించారు. నెయ్యిని వంద శాతం పరిశీలించేందుకు వీలుగా ఇటీవల ఏర్పాటు చేసిన గ్యాస్ క్రోమటోగ్రాఫీ(జీసీ), హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ కోమటోగ్రాఫీ(హెచ్‌పీఎల్‌సీ) యంత్రాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏఎన్సీ, హెచ్‌వీసీ ఉప విచారణ కార్యాలయాల వద్ద జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. అంతకుముందు తిరుమలలోని అన్నమయ్య భవనానికి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రాన్ని పరిశీలించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఈఈ సుబ్రహ్మణ్యం, డిప్యూటీఈవోలు వెంకటయ్య, భాస్కర్, సోమన్నారాయణ, డీఈ చంద్రశేఖర్, హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్ ఇతర అధికారులు ఈవో వెంట ఉన్నారు.



ఫుడ్ వాటర్ ల్యాబ్‌లో పరీక్షల గురించి సిబ్బందితో మాట్లాడుతున్న ఈవో తదితరులు

సర్వ దర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.19 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,020

తలనీలాలు సమర్పించినవారు: 27,609



ఆయువు పోసే ఆలయం

హృద్రోగ బాధిత చిన్నారులకు అక్కడ ఊపిరిపోస్తారు. గుండె కవాటాలను సరిచేసి ప్రాణం నిలబెడతారు. ఆరోగ్య జీవితాన్ని ప్రసాదించి ఆయువునిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే గుండె సంబంధిత వ్యాధిగ్రస్థులకు అది ఆలయమే. పేదలకు అమూల్య సేవలందిస్తున్న పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ అనతికాలంలోనే హృదయాలయమనే పేరును సార్థకం చేసుకుంది. టీటీడీ ఆధ్వర్యంలోని బర్డ్ ఆస్పత్రి ప్రాంగణంలో ఈ సెంటర్ 2021లో ప్రారంభమై తన సేవలతో రోగుల హృదయంలో స్థానం సంపాదించుకుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- 4 వేల మంది చిన్నారులకు హృద్రోగ శస్త్రచికిత్సలు
- 20 మందికి విజయవంతంగా గుండె మార్పిడి
- రోగులను గుండెకు హత్తుకుంటున్న పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్



పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్



కొత్త భవనం నమూనా


నవజాత శిశువుల నుంచి వృద్ధుల వరకు పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ గుండెకు హత్తుకుని ఆలంబనగా నిలుస్తోంది. మూడున్నరేళ్ల వ్యవధిలోనే గుండెకు సంబంధించి ఎన్నో సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేసి ఓ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకుంది. రాష్ట్రంలో గుండె మార్పిడి చేసే ఏకైక ఆస్పత్రిగా గుర్తింపు సాధించింది. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి సారథ్యంలో 14 మంది వైద్యనిపుణులు నిరంతరం ఇక్కడ సేవలందిస్తున్నారు. తక్కువ కాలంలోనే 20మందికి గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేశారంటే విస్తుపోవాల్సిందే. ప్రమాదవశాత్తూ చనిపోయినవారి గుండెను గ్రీన్ ఛానల్ ద్వారా వాయువేగంతో తెచ్చి మృత్యువు అంచున చేరిన వారిని కాపాడుతున్నారు. నాలుగు వేల మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేసి వారిలో మళ్లీ చిరునవ్వులు పూయించారు. రోగులను ఇంతలా మానవీయ సేవలందిస్తున్న ఈ ఆస్పత్రి ప్రస్థానాన్ని చూసి అపోలో ఆస్పత్రుల చైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి అచ్చెరువొందారు. రెండేళ్ల క్రితం ఆయన సెంటర్‌ను సందర్శించి వైద్యబృంద సేవలను కొనియాడారు. ఇంతకంటే గొప్పగా తమ ఆస్పత్రి ఉండదంటూ సంస్థ తరఫున పరికరాలు అందజేస్తూ కితాబునిచ్చారు.

పేదుకు ఉచిత వైద్య సేవలు

టీటీడీ శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టు సహకారంతో నడుస్తున్న హార్ట్ సెంటర్‌లో వైద్యసేవలు పేదలకు ఉచితం. ఎన్టీఆర్ వైద్యసేవతో పాటు ఆయుష్మాన్ భారత్ కార్డులున్న వారికీ ఇక్కడ ఉచితంగా వైద్యం చేస్తున్నారు. మన రాష్ట్రానికి చెందిన వారే కాకుండా యూపీ, బిహార్, జార్ఖండ్, వెస్ట్ బెంగాల్, ఒడిశానుంచీ వస్తుంటారు. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ నుంచి కూడా హృద్రోగ బాధితులు వస్తున్నారంటే సెంటర్ విశిష్టత అర్థం చేసుకోవచ్చు. ఈ సేవలను గుర్తించిన ఆసియా టుడే రీసెర్చ్, మీడియా 2023లో బెస్ట్ పీడియాట్రిక్ కార్డియాక్ సెంటర్‌గా ఎంపిక చేసింది.

విస్తరణ దిశగా అడుగులు

హార్ట్ సెంటర్ మరింత విస్తరించనుంది. బర్డ్ ఆస్పత్రి పాత భవనంలో 70 పడకలతో తాత్కాలికంగా ప్రారంభమైన ఈ సెంటర్ ఇప్పుడు రూ.250కోట్లతో పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీగా రూపుదిద్దుకుంటోంది. ఇందులో 350 పడకలుంటాయి. 14 అదనపు పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీస్ సేవలు అందుబాటులోకి వస్తాయి. న్యూరాలజీ, కిడ్నీ వ్యాధులు, కాలేయం, హెమటో అంకాలజీ, తలసీమియా రోగులకు సేవలందిచడంతోపాలు బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స సైతం చేసేందుకు వడివడిగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఐకానిక్‌గా నిర్మిస్తున్న కొత్త భవనంలో మల్టీ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎయిర్ అంబులెన్స్ యూనిట్ సైతం ఏర్పాటవుతోంది. మరో ఏడాదిలో హార్ట్ సెంటర్ మరింతగా ఎదిగేందుకు సమాయత్తమవుతోంది.



చికిత్స పొందుతున్న చిన్నపిల్లల వార్డు

హార్ట్ సెంటరుకు శ్రీ'నాథుడు'



హార్ట్ సెంటర్ గుర్తింపు వెనుక డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి విశేష ప్రతిభ,పెద్ద మనసు దాగి ఉంది. ఉత్తమ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్‌గా తన బృందానికి సమర్థ సారథ్యం వహిస్తున్నారు. దాతల ద్వారా వచ్చే అధునాతనమైన పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. పేరెన్నికగన్న కార్పొరేట్ ఆస్పత్రులు నెలకు రూ.10 లక్షలు జీతమిస్తామన్నా స్వామి సన్నిధిలో సేవ చేయడంలోనే ఆయన సంతృప్తి చెందుతారని శ్రీనాథ్ సన్నిహితులు చెబుతారు.తెలంగాణ గవర్నర్ తమిళిసై నుంచి డాక్టర్ శ్రీనాథ్ అవార్డు అందుకున్నారు.

నా బిడ్డకు పునర్జన్మ



హైదరాబాద్‌లో నా భార్య బాబుకు జన్మనిచ్చింది. వెనువెంటనే పసికందుకు గుండె సమస్య ఉందని తేలింది. హైదరాబాదులో రూ. 6లక్షలు అవుతుందన్నారు. ఏం చేయాలో పాలుపోలేదు. తిరుపతి హార్ట్ సెంటర్ గురించి తెలుసుకుని ఈనెల 9న జాయిన్ చేశాం. 48 గంటల్లోనే వైద్యులు శస్త్రచికిత్స చేశారు. బిడ్డకు పునర్జన్మ ఇచ్చారు. ఈ ఆస్పత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.

- మురళి, ఆటోడ్రైవర్, సి.మల్లవరం, చిత్తూరు జిల్లా



నాకు కొత్త బతుకు ఇచ్చారు

మాది తూర్పుగోదావరి జిల్లా జి.రాగంపేట. మా నాన్న రైతు. గతేడాది డిసెంబరులో నాకు ఛాతిలో ఇబ్బంది వచ్చింది. చాలా ఊళ్లు తిరిగాం. తగ్గలేదు. చివరికి గుండె మార్పిడి చేయాలన్నారు. విశాఖ వైద్యుల సూచనతో ఈ ఏడాది జనవరి 21న తిరుపతి హార్ట్ సెంటర్‌కు వచ్చాం. దాత గుండె కోసం ఇక్కడే అద్దెకు ఇల్లు తీసుకుని ఎదురుచూశాం. మార్చి 2న గుండె దొరికిందని ఫోన్ చేశారు. విజయవాడలో బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయిన వ్యక్తి నుంచి గుండెను ఆగమేఘాలపై తెచ్చి నాకు అమర్చారు. 40 రోజులు ఆస్పత్రిలోనే ఉన్నా. ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనాథ్ సర్ కొత్త బతుకునిచ్చారు. నెలకోసారి రివ్యూకి వస్తున్నా. ఇప్పుడు ఆరోగ్యం బాగుంది.

- వై. వినయ్, బి.ఫార్మసీ విద్యార్థి

ఘాట్‌లో అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు



ప్రమాదానికి గురైన కారు, గాయపడిన భక్తులు

తిరుమల,జూలై16(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో బుధవారం ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. బెంగుళూరుకు చెందిన నలుగురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వినాయక స్వామి ఆలయానికి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.

21న టీటీడీ ఎస్వీ శిల్ప కళాశాల ప్రవేశ పరీక్ష

తిరుపతి అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీ శిల్పకళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 21న పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు అలిపిరి సమీపంలోని కళాశాల ప్రాంగణంలో పరీక్ష జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకోని వాళ్లూ నేరుగా పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావచ్చన్నారు. ఇందుకుగాను రూ.350 చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. అర్హత సాధించినవారికి విద్యార్థులకు 28వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఎంపికైన వారికి ఉపాధి అవకాశాల నిమిత్తం మొదటి ఏడాదిలోనే టీటీడీ రూ.లక్ష బ్యాంకులో డిపాజిట్ చేస్తుందన్నారు. నాలుగేళ్లలో ఆలయ నిర్మాణం, శిల, సుధా, దారు, లోహ శిల్ప, సంప్రదాయ చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 0877-2264637, 98669 97290, 94403 67826 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఐఐటీలో నేడు ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం



ఐఐటీలోని ఫుడ్‌ప్రాసెసింగ్ సెంటర్

ఏర్పేడు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని ఐఐటీలో కామన్ ఇంక్యుబేషన్ సెంటర్(సీఐసీ)ని గురువారం కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో శేఖర్ బాబు పాల్గొననున్నారు. ఈ కేంద్రాన్ని ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వశాఖ అభివృద్ధి చేసింది. ఈ కేంద్రాన్ని తిరుపతి ఐఐటీ రసాయనిక ఇంజినీరింగ్ ప్రొఫెసర్ కె.ఎస్.ఎం.రాఘవరావు సమన్వయంతో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మార్గదర్శకత్వంలో అభివృద్ధి చేశారు. ఈ కేంద్రంలో రోజుకు 20 టన్నుల మామిడి, అంజీర్, జామ తదితర పండ్లతో జ్యూస్, పల్ప్, జామ్, పికిల్స్ వంటివి తయారు చేస్తారు. ఈ యూనిట్ విద్యార్థులకు పరిశోధన కేంద్రంగా కూడా ఉపయోగపడుతుంది. స్థానికంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కానుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

బంగారు కుటుంబాలకు భరోసా ఇవ్వాలి

- ఎల్లుండి మార్గదర్శకులతో సీఎం ముఖాముఖి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆదాయంలో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించి, బంగారు కుటుంబాలుగా ఎంపిక చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. వారికి భరోసా ఇవ్వాలని కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులు, మార్గదర్శకులతో పీ4పై సమావేశం నిర్వహించారు. వీరిని ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న వారు దత్తత తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. విద్యతోపాటు నైపుణ్యం కల్పించి అండగా నిలవాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. శనివారం తిరుపతికి వస్తున్న సీఎం చంద్రబాబు.. బంగారు కుటుంబాలు, మార్గదర్శకులతో ముఖాముఖి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, తాజ్ హోటల్, పాయ్ వైస్రాయ్ హోటల్ ప్రతినిధులు, రాస్, అమరరాజా, రోటరీ క్లబ్ మార్గదర్శకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చెస్ శిక్షణ

- చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి

తిరుపతి(క్రీడలు), జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు చదరంగం శిక్షణ తరగతులు ఏర్పాటు చేయబోతున్నామని తుడా చైర్మన్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాలర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్, ధ్యానచంద్ అవార్డు గ్రహీత అభిజిత్‌కుంటే తిరుపతి పర్యటన నిమిత్తం బుధవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. రాష్ట్ర, జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు కె.వి.వి.శర్మ, మల్లికార్జున, శ్రీనివాససూరి, బాలాజీచౌదరి, వెంకట్ అనీల్, వాసువర్మ, సిసింద్రీ, సునీత ఆయనకు స్వాగతం పలికారు. అభిజిత్‌కుంటే తుడా కార్యాలయంలో దివాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఆయన రాత్రికి తిరుపతిలోనే బసచేసి, గురువారం ఉదయం తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకోనున్నారు. అనంతరం మంగళంలోని ప్రభుత్వ బాలుర వసతిగృహాన్ని సందర్శిస్తారు. ఇటీవల జరిగిన ఆన్‌లైన్ అంతర్జాతీయ చదరంగం పోటీలలో విజేతలుగా నిలిచిన పిల్లలకు మెడల్స్ ప్రదానం చేస్తారు.



చెస్ గ్రాండ్ మాస్టర్‌తో మాట్లాడుతున్న దివాకర్‌రెడ్డి, శర్మ

అవ్వాచారి కోనలోకి దూకేశాడు

- రోప్‌ల ద్వారా దిగి జీపు డ్రైవరును రక్షించిన భద్రతాసిబ్బంది

తిరుమల, జూలై16 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని లోయలో దూకిన ఓ డ్రైవర్‌ను టీటీడీ భద్రతా సిబ్బంది కాపాడారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలోని దొర్నిపాడుకు చెందిన జీపు డ్రైవర్ బోయా మాధవ రాయుడు(30) బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో అలిపిరి కాలినడకమార్గంలో తిరుమలకు వస్తూ అక్కగార్ల ఆలయానికి సమీపంలోని అవ్వాచారి కోనలోకి దూకేశాడు. గమనించిన భక్తులు వెంటనే సమీపంలోని భద్రతా సిబ్బందికి సమాచారమిచ్చారు. తిరుమల పోలీసులు, ఫైర్, విజిలెన్స్, ఫారెస్ట్ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని రోప్‌ల ద్వారా లోయలోకి దిగి వెతికారు. గాయాలతో ఉన్న మాధవ రాయుడిని పైకి తీసుకొచ్చి తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. చిన్న చిన్న గాయాలతోపాటూ అతడి చేయి విరిగిందని, ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. తన భార్య అనారోగ్యం వల్ల లోయలోకి దూకేశానని మాధవ రాయుడు పోలీసులకు తెలిపారు.



మాధవ రాయుడిని లోయ నుంచి బయటకు తీసుకొస్తున్న భద్రతాసిబ్బంది - చికిత్స పొందుతున్న మాధవ రాయుడు

ఇద్దరు ఎస్ఎస్ఈల సస్పెన్షన్!

- రైలు పెట్టె కాలిన ఘటనలో

తిరుపతి(సెంట్రల్), జూన్16(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్ రైళ్ల పార్కింగ్ యార్డులో రెండు రోజుల క్రితం బోగీ కాలిపోయిన ఘటనలో ఇద్దరు ఎస్ఎస్ఈలను సస్పెండ్ చేసినట్లు ఉన్నత స్థాయి అధికార వర్గాలు తెలిపాయి. హిస్సార్- తిరుపతి వారాంతరపు ఎక్స్‌ప్రెస్ రైలు బోగీ కాలిన ఘటనపై విచారణ జరుగుతోంది. పీసీఎంఈ, సీనియర్ డీఎంఈ మణికుమార్, ఇతర అధికారులు కాలిన బోగీని పరిశీలించారు. సోమవారం విధి నిర్వహణలో ఉన్న పర్యవేక్షక సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు మురళి, వరప్రసాద్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. కాగా, ఈ మంటలను సకాలంలో గుర్తించడం ద్వారా.. కోట్ల రూపాయల రైల్వే ఆస్తిని కాపాడిన చిరుద్యోగి, పాయింట్స్ మెన్ హరీష్ కుమార్ ఇంటికి బుధవారం గుంతకల్లు డివిజన్ అదనపు డివిజన్ మేనేజరు సుధాకర్ వెళ్లారు. గాయపడిన ఆయన్ను పరామర్శించారు.

రైల్వే స్టేషన్‌లో ఏడీఆర్ఎం తనిఖీలు

తిరుపతి రైల్వే స్టేషన్లలో బుధవారం గుంతకల్లు డివిజన్ ఏడీఆర్ఎం మణికుమార్ తనిఖీలు నిర్వహించారు. ప్లాట్ ఫారాలను పరిశీలించారు. పరిశుభ్రత ప్రమాణాలను మెరుగు పరచాలని ఆదేశించారు. మొదటి ప్లాట్ ఫారంలోని కార్యాలయాలను పరిశీలించిన ఆయన.. కాలం చెల్లిన వస్తువులను స్టోర్స్‌కు తరలించాలని ఆదేశించారు. అధికారులు మణికంఠ, మణికుమార్ ఎస్ఎమ్ఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట

మళ్లీ ఏనుగుల భయం

- యల్లంపల్లెలో వరిపొలాలపై దాడి

చంద్రగిరి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏనుగులు మళ్లీ అలజడి రేపుతున్నాయి. యల్లంపల్లెలో మంగళవారం అర్ధరాత్రి పంట పొలాలపై దాడి చేశాయి. ఏడు ఏనుగులు చొరబడి ధనప్రకాష్‌రెడ్డి, మునికృష్ణయాదవ్‌లకు చెందిన పొలాల ఫెన్సింగ్ రాళ్లను తొలగించి పైపులు ధ్వంసం చేశాయి. వరి పంటను తొక్కేశాయి. గ్రామానికి ఆనుకొని పొలాలు ఉండటంతో ఏనుగులు వచ్చి దాడి చేస్తాయేమోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. వీరి సమాచారంతో అటవీ అధికారులు, సిబ్బంది వచ్చి ఏనుగులను అటవీ ప్రాంతంలోకి మళ్లించడానికి ప్రయత్నించారు. మూలపల్లి చెరువులో నీరుతాగి, ముంగిలిపట్టు అటవీ ప్రాంతంలోకి ఇవి వెళ్లిపోవడతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఏనుగులు పొలిమేరలోనే ఉండటంతో గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లకూడదని, అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. గతంలో మామిడిమానుగడ్డలో ఏనుగులు తిరగబడటంతో యల్లంపల్లి, భీమవరం, మూలపల్లె, కొండ్రెడ్డికండ్రిగ గ్రామస్థులు కలవరపడుతున్నారు. ఏనుగుల దాడిపై ఎమ్మెల్యే పులివర్తి నానీ అటవీశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. కొద్దిరోజులపాటు ఆ ప్రాంతంలో తిరుగుతూ ఏనుగులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత రైతులకు త్వరగా నష్టపరిహారం చెల్లించేలా చూడాలని ఆదేశించారు.



పొలాలపై దాడులు చేస్తున్న ఏనుగులు